‘కస్తూర్బా’లో కనిపించని మెనూ..

- పూరీలకు బదులు పులిహోరా.. ఇడ్లీలకు.. కిచిడీ
- తక్కువ ధర కూరగాయల సరఫరా
- చికెన్ రుచి ఎరుగని విద్యార్థినులు
- బిల్లులు రాక పెట్టడం లేదంటున్న కాంట్రాక్టర్లు



మరిపెడ కేజీబీవీ

మహబూబాబాద్ అర్బన్: చదువు మధ్యలో మానేసిన బాలికలు, ఆర్థిక స్థోమత లేని వారు, అనాథలకు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఏర్పాటు చేసింది ప్రభుత్వం. జిల్లాలో మొత్తం 15 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 3315 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. కస్తూర్బాలో మెనూ ప్రకారం బాలికలకు నాణ్యమైన భోజనం అందించడం లేదు. ఇడ్లీ బదులు పులిహోరా.. పూరీ బదులు కిచిడీ పెడుతున్నారు. మెనూ సక్రమంగా నిర్వహించకపోవడంతో బాలికలు దీనిపై గట్టిగా ప్రశ్నించే అవకాశం లేకుండాపోతోంది. దీనిపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేసిన ఫలితం శూన్యం.

జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చాలా ఏళ్లుగా మెస్ చార్జీలు పెంచడం లేదు. ప్రభుత్వం రూ.40 ఒక్కో విద్యార్థినికి రోజుకు మూడు పూటలా క్వాలిటీ ఫుడ్ పెట్టాలంటున్నది. ఆ రేట్లకు గిట్టుబాటు కాక, బిల్లులు సకాలంలో అందక కాంట్రాక్టర్లు తక్కువ ధరకు దొరికే సరుకులు, కూరగాయలు సప్లయి చేస్తున్నారు. ప్రతి విద్యార్థినికి 100 గ్రాములకు గాను 50నుంచి 60గ్రాములు మాత్రమే చికెన్ ఇస్తున్నారు. 5 రోజులు గుడ్డు పెట్టాల్సి ఉండగా.. రెండు, మూడురోజులు మాత్రమే తెప్పిస్తున్నారు. ప్రతిరోజు సీజనల్ పండ్లు అందించాలి. కొన్ని చోట్ల ఐదు రోజులు అవి కూడా అరటి పండ్లతో సరిపెడుతున్నారు. జిల్లాలో నర్సింహులపేట, మరిపెడ, తొర్రూరు, పెద్దవంగర కేజీబీవీలో నాన్ వెజ్ బాలికలకు అందించడం లేదు. మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందక రక్తహీనత, దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు.

పర్యవేక్షణ కరువు ..

మెనూ సక్రమంగా అమలు అవుతుందో లేదో చూసే బాధ్యత జిల్లా ఉన్నతాధికారులపై ఉంది. అధికారులు మాత్రం పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో కొన్ని పాఠశాలల్లో ప్రత్యేకాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీమూడు, నాలుగు నెలలకోసారి మార్చాల్సిన మెస్ చార్జీలను సంవత్సరాల తరబడి మార్చడం లేదు. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే కానీ అసలు విషయాలు బయటపడతాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో వారు కూడా 50శాతం మాత్రమే కూరగాయలను, ఇతర సామగ్రిని అందిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించలేక పోతున్నాం. అందులో పెండింగ్ బిల్లులు మొత్తం జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాలికలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటాం.

- వి.విజయకుమారి, జీసీడీఓ, మానుకోట

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 28న జిల్లా కేంద్రంలో జరగనున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు యలమంచిలీ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. భద్రాచలంలో విజయ సంకల్ప యాత్ర ఆదివారం ప్రారంభమైందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రభారి చింతలపూడి భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోసంగి మురళీ, ధర్మారపు వెంకన్న, రాష్ట్ర నాయకులు మాధవపెద్ది శివర్ధన్ రెడ్డి, కొనకం పెట్టయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు దేవిక, నాయకులు పైండ్ల శ్రీనివాస్, విజయేందర్, రహమతుల్లా, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయాలి



విచారణ చేపడుతున్న సంఘం నాయకులు

బయ్యారం: న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌తోపాటు పలువురు పార్టీ నాయకులపై భద్రాద్రి జిల్లా ఇల్లెందు పోలీసులు పెట్టిన పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని పౌరహక్కుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగు ఉపేందర్‌రావు, రాయల పావెల్ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం, నారాయణపురం, టేకులగూడెం, మిర్యాలపెంట, ఇసుకమేధి గ్రామాల్లో పర్యటించిన పౌరహక్కుల సంఘం బృందం ఇటీవల జరుగుతున్న పోలీస్ కూంబింగ్, ఎన్డీ నాయకుల అరెస్ట్‌పై ఆదివారం విచారణ చేపట్టింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు రవి, విప్లవ్‌కుమార్, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, ఉదయ్‌రాఘవేందర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించడం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

తొర్రూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 2న ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి శ్రీధర్‌బాబు, తోట నీలిమలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఓలేటి లక్ష్మణాచార్యులు, ప్రతినిధులు ఏడునూతల సుధీర్, అలహరి శ్యాంసుందర్, వెన్నప్ప మోహన్ శర్మ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత టీజీ బాయ్స్



ట్రోఫీతో టీజీ బాయ్స్ జట్టు

కురవి: మండల కేంద్రంలో కురవి క్రికెట్ కింగ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా టీజీ బాయ్స్ జట్టు నిలిచింది. ఆదివారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. టీజీ బాయ్స్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.25వేల నగదును దాత కల్లెపు సుధాకర్ అందజేశాడు. ద్వితీయ స్థానంలో నిలిచిన కురవి క్రికెట్ కింగ్స్ జట్టుకు దాత నద్దునూరి మహేష్ రూ.15వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బండారి మహేష్, గుగులోత్ నవీన్, ఉల్లేందుల మహేష్, జంపాల రాము, బండారి కార్తీక్, తరాల దినేష్, కొలిపాక వీరేందర్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌లో మాట్లాడాలి



శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిని ఇంగ్లిష్‌లో మాట్లాడించడానికే.. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉచిత ఇంగ్లిష్ శిక్షణ అందిస్తున్నామని విల్ టు కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ అన్నారు. ఇంగ్లిష్ పరిశోధన రాష్ట్ర విద్యా సంస్థ సహకారంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆదివారం ఉచిత ఇంగ్లిష్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 24 జిల్లాలో ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ తరగతులను పూర్తి చేశామన్నారు. విద్యార్థులు ప్రతి చిన్న విషయాన్ని ఇంగ్లిష్‌లో మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నించాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌లో మాట్లాడడమే శిక్షణ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏసీజీఈ శ్రీరాములు, ఏఎంఓ చంద్రశేఖర్ ఆజాద్, ఉపాధ్యాయులు వీరన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘన నివాళి

గార్ల: జైనుల గురువు ఆచార్య విద్యాసాగర్ మహరాజ్‌కు స్థానిక జైన్ మందిరంలో ఆదివారం నివాళులర్పించారు. దేశవ్యాప్త జైనుల పిలుపు మేరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మహవీర్‌జైన్, ప్రణయ్‌జైన్, పదమ్‌జైన్, దిలీప్‌జైన్, విశాల్‌జైన్, ఆకాష్‌జైన్, సుభాష్‌జైన్, సతీష్‌జైన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీ కృషితో రోడ్ల అభివృద్ధి



మరిపెడ రూరల్: ఎంపీ మాలోతు కవిత కృషితోనే గిరిజన తండాల్లో రోడ్ల అభివృద్ధి జరిగిందని లూనావత్‌తండా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ లూనావత్ వీరమల్లు అన్నారు. మండలంలోని లూనావత్‌తండాలో రూ.10లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించాడు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సరోజ, నాయకులు లింగయ్య, రాములు, శంకర్, వీరన్న, వీరేందర్, పంతులు, వీలెందర్, హట్టి, భిక్షం, లక్పతి, భద్రు, వీరన్న పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం

నెల్లికుదురు: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఆదివారం మండల కేంద్రానికి చెందిన దాత రూ.50,116 విరాళంగా అందజేశాడు.

రచయిత్రి యాకమ్మకు ఘన సన్మానం

మహబూబాబాద్ అర్బన్: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా హనుమకొండలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవిత పోటీల్లో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈక్రమంలో ఐలమ్మను ఉదయం సాహితీ–సాహిత్య వికాస్ వేదిక ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు వకుళవాసు, ఆచార్య బన్న ఐలయ్య సన్మానించారు.

డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

గార్ల: గార్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ డిమాండ్ చేశాడు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. రూ.2కోట్ల వ్యయంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గార్లలో డిగ్రీ కళాశాల నిర్మించారన్నారు. కళాశాల ఊరి చివర ఉండడం వలన ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు కళాశాల ఆవరణంలో తిరుగుతున్నాయన్నాడు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నెహ్రూసెంటర్: స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయని పాలకులు ఆయన మరణానంతరం భారతరత్న ఇచ్చి ఆయన సిఫార్సులను కూడా చంపేశారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతులను సాధించుకున్న హక్కులను అమలు చేయాలన్నారు.

నాయకత్వ స్వీకరణ వేడుకలు



డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండాలో ఆదివారం మంగ్యాతండా వారసత్వ నాయకత్వ స్వీకరణ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగ్యాతండా వారసత్వ నాయకుడిగా భూక్యా శేఖర్‌నాయక్, ఉపనాయకుడిగా భూక్యా రాథోడ్‌నాయక్ సంప్రదాయబద్ధంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సమేర్‌చంద్‌జైన్, నాయకులు దేవ్‌సింగ్, భూక్యా తారాచంద్, సకిరామ్‌నాయక్, మోహన్‌నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

మహబూబాబాద్ రూరల్ : చికిత్స పొందుతున్న రైతు మృతి చెందిన సంఘటన మహబూబాద్ మున్సిపాలిటీ పరిధి శనగపురం గ్రామ శివారు బగ్గతండాలో జరిగింది. రైతు గుగులోతు వెంకన్న (40)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా వరి సాగు చేస్తున్నాడు. పంట దిగుబడి రాకపోగా అప్పులయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ శివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపాడు. సంబంధికులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

వైద్యశిబిరం

మరిపెడ: సీఐటీయూ ఆధ్వర్యంలో మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో కార్మికులకు ఆదివారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య శిబిరాన్ని ప్రారంభించాడు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్, ఉపేందర్, డాక్టర్లు ఓరుగంటి రూప, వైద్య సిబ్బంది శిరీష, స్వప్న, బాసు, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఏఈ వడ్డెపల్లి పుల్లయ్య దంపతులు వారి కుమార్తె నీరజ జ్ఞాపకార్థం పరీక్ష సామగ్రిని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, ఉపాధ్యాయులు వెంకన్న, వజ్రకుమారి, బిక్షం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

మరిపెడ రూరల్: ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం స్పందించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందాల రమేష్ డిమాండ్ చేశాడు. ఈమేరకు మండలంలోని గుండెపుడి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు అల్లి శ్రీనివాస్‌రెడ్డి, సంఘం నాయకులు మహేష్, వెంకటేశం, రాములు పాల్గొన్నారు.

తగ్గిన గ్యాస్ సిలిండర్ల విక్రయం

డోర్నకల్: గ్యాస్ ఏజెన్సీలలో సిలిండర్ల విక్రయం గణనీయంగా తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 27 నుంచి రూ.500కు సబ్సిడీ సిలిండర్ పంపిణీ చేస్తుండడంతో ప్రస్తుతం సిలిండర్ల విక్రయం గణనీయంగా తగ్గింది. డోర్నకల్‌లోని రెండు, కురవిలోని ఒక ఏజెన్సీ ద్వారా మండలంలో సుమారు 25వేల గ్యాస్ కనెక్షన్లకు సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. మూడు ఏజెన్సీల ద్వారా మండలంలో ప్రతీ రోజూ 150 నుంచి 200 సిలిండర్లను విక్రయిస్తున్నారు. వారంరోజులుగా మూడు ఏజెన్సీల నుంచి రోజుకు 30 సిలిండర్లను కూడా విక్రయించడం లేదు. 27వ తేదీ నుంచి సబ్సిడీ సిలిండర్ల విక్రయంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని నిర్వాహకులు చెబుతున్నారు. సిలిండర్ కొనుగోలుకు మొత్తం డబ్బు చెల్లించాలనే దానిపై వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల: మిర్చిపంటను బస్తాల్లో తొక్కే విషయంలో సహాయం చేయలేదనే అక్కసుతో అత్త, బావమరిదిపై అల్లుడు కర్రతో దాడి చేసిన సంఘటన కొత్త తండాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం కొత్తతండాకు చెందిన భూక్యా కుమార్, భూక్యా హరిలాల్ కలిసి అదే గ్రామానికి చెందిన అత్త ధరావత్ అమ్మి, బావమరిది ధరావత్ రాజేష్‌లను మిర్చిని బస్తాల్లో తొక్కే సమయంలో తనకు సహాయం ఎందుకు చేయలేదని కర్రలతో దాడి చేశారు. ఈదాడిలో అత్త, బావమరిదికి బలమైన గాయాలయ్యాయి. అమ్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి యాదవులను ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ యాదవ మహాసభ మండల అధ్యక్షుడు గంగాధర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యాదవ కులస్తులు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కోరారు. విద్యా, వైద్యా, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. వెనుకబడిన యాదవులను ప్రభుత్వం ఆదుకొని చేయూత ఇవ్వాలని పేర్కొన్నాడు. కార్యక్రమంలో రమేష్, సుభాష్, సమ్మయ్య, వెంకటనారాయణ, శ్రీనివాస్, మహేష్, కుమారస్వామి, కర్నాకర్, సతీష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మండలాలకు ఒక్కరే..

- ఇన్‌చార్జ్ ఎంఈఓగా గార్లతోపాటు మరో ఏడు మండలాలకు కేటాయింపు
- గతేడాది జీరో ఫలితాలు సాధించిన పెద్దకిష్టాపురం హైస్కూల్

గార్ల: గార్ల మండలానికి రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువైందని విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. గార్ల మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేస్తున్న బి.పూల్‌చంద్‌కు గార్ల మండలంతోపాటు జిల్లాలోని మరో 7మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేస్తుండటం వలన పనిభారంతో పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు విధులపై సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గత ఏడాది పెద్దకిష్టాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతిలో జీరో ఫలితాలు వచ్చాయి. ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల నుంచి ఉపాధ్యాయుల రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదు. రైళ్లు ఆలస్యంగా వస్తే ఆరోజు ఉపాధ్యాయులు పాఠశాలలకు ఆలస్యంగా వస్తారు. గార్ల ఇన్‌చార్జ్ ఎంఈఓ పనిచేస్తున్న పూల్‌చంద్ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి హైస్కూల్‌లో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ మహబూబాబాద్ జిల్లాలోని 8 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యాధికారి స్పందించి గార్ల మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించి ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ పెంచి, పాఠశాలల మనుగడను కాపాడాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం..

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దంతాలపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాలులో ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. దాట్ల గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈనెల 27నుంచి గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రైతు రుణమాఫీ, తదితర హామీల అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బట్టు నాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ ఒలాద్రి ఉమమల్లారెడ్డి, ఎంపీటీసీలు యాకయ్య, సతీష్, తహసీల్దార్ శ్రీనువాసరావు, ఎంపీడీఓ వివేక్రం, ఆర్‌ఐ నజీముద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

డీడీలు కట్టిన ప్రతి గొల్లకురుమకు రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఊడుగుల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి మురళీ, ఆవుల సురేష్ పాల్గొన్నారు.

ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు



బ్రహ్మోత్సవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని నర్సంపేట రోడ్డులో గల మహాగాయత్రి దేవాలయ 30వ వార్షికోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు వంకోజు జేలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. భాగంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, లక్ష కుంకుమ పూజ, శ్రీగాయత్రి యాగం, రుద్ర, చండీ హోమం, దీపాలంకరణ సేవ పూజలు చేశారు.

నేడు గాయత్రి కల్యాణం..

సోమవారం శ్రీమహాగాయత్రీ దేవి అమ్మవారు, విశ్వబ్రహ్మ భగవానుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. పూర్ణాహుతి పూజలు జరిపి, మహాఅన్నదానం ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేస్తామన్నారు. సాయంత్రం రథోత్సవం ఉంటుందని, భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని పేర్కొన్నారు.

క్రీడలు నిర్వహించడం అభినందనీయం



బహుమతులు అందజేస్తున్న సీఐ సంజీవ్

తొర్రూరు: ట్రాస్మా ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమని సీఐ సంజీవ్ అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ట్రాస్మా ఆధ్వర్యంలో అభ్యాస్ స్కూల్‌లో క్రీడలు నిర్వహించారు. అనంతరం ముత్తినేని ప్రకాష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీ షర్టులను దాత తాళ్లపల్లి రమేష్, ట్రాస్మా రాష్ట్ర కార్యదర్శి జీఎస్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ ఏకాంతం, సలహాదారులు దేవేందర్ రెడ్డి, చెంబారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ‘డబుల్’ ఇళ్ల నిర్మాణాలు



మధ్యలోనే ఆగిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్లు

- నిర్మాణాలను మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టర్

గార్ల: మండలంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్రూంల ఇళ్ల పథకం నిర్మాణ పనులు సంబంధిత అధికారులు, గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. మండలంలోని ముల్కనూరు, మర్రిగూడెం, పుల్లూరు, సేరిపురం, బుద్దారం పంచాయతీలకు కలిపి, ఒక్కో పంచాయతీకి 20 చొప్పున, 5 పంచాయతీలకు 100 డబుల్ బెడ్రూంలు 8 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో పుల్లూరు, మర్రిగూడెం పంచాయతీలో నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించగా, మిగతా ముల్కనూరు, బుద్దారం పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై ఐటీడీఏ ఏఈ సాలార్‌ను సాక్షి వివరణ కోరగా ముల్కనూరు, బుద్దారం పంచాయతీల్లో మధ్యలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో మాట్లాడితే నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నాడని ఇట్టి విషయాన్ని పైఅధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నాడు.